AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## అడిషనల్ పీపీగా నరసింహారెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** సీనియర్ న్యాయవాది నరసింహారెడ్డి అడిషనల్ పీపీగా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవిగుప్తా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిజామాబాద్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నరసింహారెడ్డి మూడేళ్లు పనిచేయనున్నారు. ఆయనకు పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలియజేశారు.









జెండా బాలాజీ ఆలయంలో భక్తుల పూజలు



## వైష్ణవాలయాల్లో భక్తుల సందడి

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాల్లో బారులు తీరారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని ఉత్తర తిరుపతి క్షేత్రం, జెండా బాలాజీ, విఠలేశ్వర ఆలయం, చక్రం గుడి తదితర ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. తొలిఏకాదశి కావడంతో ఉపవాస దీక్షలు పాటించారు. - అక్షరటుడే, ఇందూరు

## శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో

**అక్షరటుడే, ఆర్మూర్:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో ఎగువ నుంచి స్థానికంగా కురిసిన వర్షాలతో జలాశయంలోకి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి 6,090 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ ప్రధాన కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథ కోసం 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 323 క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ఆదివారం ఉదయానికి జలాశయంలో 1066.80 అడుగు ల(18.443 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. గతేడా ది ఇదే సమయంలో ప్రాజెక్ట్‌లో 11.5 టీఎం సీల నీరు నిల్వ ఉంది. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం నీటి నిల్వ ఎక్కువగా ఉంది. అలాగే మహారాష్ట్రలో వర్షాలు పడుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ ఏడాది జూన్ 1 నుంచి ప్రాజెక్ట్‌లోకి 7.59 టీఎంసీల నీరు వచ్చింది.

## బాన్సువాడ నుంచి తీర్థయాత్ర టూర్ ప్యాకేజీ

**అక్షరటుడే, బాన్సువాడ:** పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ డిపో ప్రత్యేక టూర్ ప్యాకేజీలు కేటాయిస్తోంది. బాన్సువాడ డిపో నుంచి వారం రోజులకు ఒక తీర్థయాత్ర టూర్ ప్యాకేజీ బస్సును ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చింది.

### కర్ణాటకలోని పుణ్యక్షేత్ర దర్శనాలు

బాన్సువాడ డిపో నుంచి ఈనెల 10న బస్సు నడపనున్నట్లు డీఎం సరితాదేవి తెలిపారు. కర్ణాటకలోని జర్గాసంగం మహాదేవుడు ఆలయం, బీదర్ నర్సింహస్వామి ఆలయం, గానుగాపూర్ దత్తాత్రేయుని ఆలయాలను దర్శనం చేసుకోవచ్చన్నారు. ప్రత్యేక డీలక్స్ బస్సు ఉదయం ఆరు గంటలకు బస్సు బయలుదేరుతుందని, రాత్రి 12 గంటలకు బాన్సువాడకు చేరుకుంటుందని తెలిపారు. టికెట్ ధర పెద్దలకు రూ.1,300, పిల్లలకు రూ.650 ఉందని, టికెట్స్ కోసం గోపికృష్ణ 9063408477ను సంప్రదించాలని ఆమె కోరారు.

గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. 16 నెలలుగా పాలకవర్గాలు లేకపోవడంతో పల్లెలను పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రత్యేకాధికారులను నియమించినా వారు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పాలన గాడి తప్పింది. దీంతో అభివృద్ధి పనులు అటకెక్కాయి. కనీసం పారిశుధ్య పనులు కూడా సక్రమంగా సాగడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- అక్షరటుడే, బాన్సువాడ



# పల్లెల్లో పడకేసిన పాలన

■ గ్రామాల్లో నిలిచిపోయిన పనులు ■ అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యం ■ ఇబ్బందులు పడుతున్న ప్రజలు ■ పట్టించుకోని ప్రత్యేకాధికారులు

పల్లెల్లో స్పెషలాఫీసర్ల పరిపాలన అస్తవ్యస్తంగా తయారైంది. సర్పంచ్‌లు లేక గ్రామ పాలన భారమంతా పంచాయతీ కార్యదర్శులపై పడింది. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు నుంచి పారిశుధ్యం, తాగు నీటి సమస్య, విధి దీపాలు ఇలా అన్ని బాధ్యతలు కార్యదర్శులే మోయాల్సి వస్తోంది. దీనితోడు నిధుల లేమి మరో సమస్యగా మారింది. కనీసం పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. జీపీ కార్యదర్శులే అత్యవసర పనులకు సొంతంగా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. ఈ కారణంగా అభివృద్ధి దేవుడెరుగు.. కనీస నిర్వహణ కరువైంది.

### ఉమ్మడి జిల్లాలో వెయ్యికిపైగా జీపీలు

ఉమ్మడి జిల్లాలో వెయ్యికి పైగా పంచాయతీలు ఉన్నాయి. ఇందులో నిజామాబాద్‌లో 545, కామారెడ్డిలో 537 జీపీలు ఉన్నాయి. ఆయా జీపీ పాలకవర్గాల పదవీకాలం గతేడాది ఫిబ్రవరితో ముగిసింది. అప్పటి నుంచి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదు.

### సొంత ఖర్చులతో..

గతంలో సర్పంచులు ఉన్నప్పుడు నిధులు లేకున్నా.. సొంత ఖర్చులతో పనులు చేపట్టేవారు. ప్రస్తుతం జీపీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు నిధులు లేవని చేతులు ఎత్తేస్తున్నారు. దీంతో కార్మికులు కొన్ని నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. ఏప్రిల్ నుంచి జీతాలు రావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికారులు ఏమి చేయలేని పరిస్థితి.

### అస్తవ్యస్తంగా పారిశుధ్యం

నిధులు.. పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. చాలా గ్రామాల్లో కార్మికులు జీతాలు రాకపోవడంతో పూర్తిస్థాయిలో పనులు చేయడం లేదు. డ్రెయినేజీలు శుభ్రం చేయడం మానేశారు. నీటి సరఫరా నిలిపివేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు నిధులు లేకపోవడంతో చెత్త సేకరణ సైతం నిలిపేశారు. జీపీ ట్రాక్టర్లు, ట్యాంకర్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. దీంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. అసలే వర్షాకాలం కావడంతో వ్యాధుల ముప్పు పొంచు ఉంటుంది. ఇలాంటి సమయంలో గ్రామాలను పట్టించుకునే వారు లేక పరిస్థితి అధ్వానంగా మారింది.

### జీతాలు రావడం లేదు



**- కిష్టవ్వ, పంచాయతీ కార్మికురాలు, దేశాయిపేట**

మూడు, నాలుగు నెలల నుంచి జీతాలు రావడం లేదు. కుటుంబం గడవడం చాలా కష్టంగా మారింది. అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### కార్మికుల ఖాతాల్లోనే నేరుగా జమ



**– సత్యనారాయణ రెడ్డి, డీఎల్పీవో, బాన్సువాడ**

పంచాయతీ కార్మికులకు నేరుగా ఖాతాలోనే వేతనాలు జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జీతాలు రాలేదు. త్వరలో వేతనాలు అకౌంట్లో జమ చేయనుంది.

### ప్రతినెలా వేతనాలు చెల్లించాం



**- వెంకటరమణారావు దేశ్‌ముఖ్, మాజీ సర్పంచ్, కోనాపూర్**

ప్రతినెలా పంచాయతీ కార్మికులకు ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలలో ఆలస్యమైతే కార్మికులకు సొంత డబ్బులతో వేతనాలు చెల్లించేవాళ్లం.

## మోపాల్ ఎస్సైగా సుష్మిత బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మోపాల్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా సుష్మిత బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్‌లో ఆమె ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోపాల్ మండలంలో డగ్స్, గంజాయి నియంత్రణలో ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

## 44 హైవేపై హాట్‌స్పాట్ల గుర్తింపు



**అక్షరటుడే, ఇందల్వాయి:** జాతీయ రహదారిపై 44పై హాట్ స్పాట్లను అధికారులు గుర్తించారు. ఏసీపీ రాజా వెంకటరెడ్డి ఆదివారం హైవే వెంబడి పర్యటించారు. ఈ సందర్భంగా ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించారు. అంతేకాకుండా ప్రమాదాలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణకు హైవే సిబ్బందితోపాటు ఆయా విభాగాల అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ వినోద్, ఎస్సైలు సందీప్, నేషనల్ హైవే సిబ్బంది ఉన్నారు.




### ఇందూరులో అనసూయ సందడి

నిజామాబాద్ నగరంలో నటి అనసూయ భరద్వాజ్ సందడి చేసింది. హైదరాబాద్ రోడ్డులో ఓ సిల్వర్ జ్యుయలరీ షోరూం ఓపెనింగ్ కార్యక్రమానికి హాజరైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి షోరూంను ప్రారంభించారు.

- అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## ముగిసిన వైశ్యసంఘం ఎన్నికలు

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ నగరంలోని వైశ్య సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. పట్టణ వైశ్య సంఘంతో పాటు శ్రీ నూతన వైశ్య ఉన్నత పాఠశాల, పట్టణ ఆర్యవైశ్య భవన్ (కల్యాణ మండపం) పాలకవర్గాలకు ఎన్నికలు జరిపారు. మాణిక్ భవన్ పాఠశాలలో ఉదయం 8 గంటలకు ఎన్నికలు ప్రారంభం అయ్యాయి. రాత్రి వరకు ఓటింగ్ జరిగింది. కాగా.. సోమవారం కన్యకాపరమేశ్వరి ఆలయంలో కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటించనున్నారు. నగరంలో 10,017 మంది ఓటర్లు ఉన్నారు. కాగా.. గెలుపు కోసం వివిధ ప్యానెళ్ల సభ్యులు పోటీగా ప్రచారం నిర్వహించారు.



## 13న నగరంలో ఊర పండుగ

**అక్షరటుడే, ఇందూరు:** ఆషాఢమాసంలో భాగంగా ఇందూరులో ఈ నెల 13వ తేదీన (ఆదివారం) ఊరపండుగ నిర్వహించనున్నట్లు సర్వ సమాజ కమిటీ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. నగరంలోని సిర్నాపల్లి గడిలో పండుగ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఊర పండుగలో నిజామాబాద్‌లోని అన్ని కుల సంఘాల సభ్యులు పాలు పంచుకుంటారని.. గురువారం బండారు వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సర్వ సమాజ్ కమిటీ ప్రతినిధులు బంటు రాము, ఆదె ప్రవీణ్, కమిటీలో వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా మోదీ పాలన




**అక్షరటుడే, ఇందూరు:** శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోదీ పాలన కొనసాగుతోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్యామాప్రసాద్ ముఖర్జీ గొప్ప న్యాయవాది, విద్యావేత్త అని గుర్తు చేశారు. 33 ఏళ్ల వయసులో కోల్‌కతా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా పని చేశారని తెలిపారు. అఖిల భారతీయ హిందూ మహాసభల అధ్యక్షుడిగా సేవలందించి, దేశ మొదటి వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు న్యాలం రాజు, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, మల్లేష్ యాదవ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్నాటి కార్తీక్, కస్తూరి కృష్ణ, నారాయణ యాదవ్, హరి తదితరులు పాల్గొన్నారు.

## స్టెమ్‌సెల్ దానంపై అవగాహన సదస్సు



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని వివేకానంద ఆడిటోరియంలో ఆదివారం స్టెమ్‌సెల్ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పందిరి శక్తి ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సొసైటీ, ధాత్రి ఫౌండేషన్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని పుష్పలత పవార్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పందిరి శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌరీ పవార్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టడంపై అభినందించారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ బుస్స ఆంజనేయులు మాట్లాడుతూ.. కేన్సర్, తలసేమియా బాధితుల కోసం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని, ముమ్మందు జిల్లావ్యాప్తంగా లాలాజల సేకరణ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ ప్రతినిధి రవీంద్రనాథ్, రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ తదితరులున్నారు.

## జేసీఐ సౌత్ కార్నివాల్‌లో విజయానంద్‌కు అవార్డులు



**అక్షరటుడే, ఇందూరు:** జేసీఐ అలుమ్ని క్లబ్ ఇండియా సౌత్ కార్నివాల్‌లో నిజామాబాద్‌కు చెందిన జిలకర విజయానంద్ ఉత్తమ వైస్ ఛైర్మన్‌గా అవార్డు అందుకున్నారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ, కర్ణాటక జేసీఐ అలుమ్ని క్లబ్ ఆఫ్ ఇండియా 12వ జోన్‌కు వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. విజయానంద్ ఉత్తమ జోన్ వైస్ ఛైర్మన్‌తో పాటు ఉత్తమ శిక్షణ విభాగం, మెంటరింగ్‌లో కూడా అవార్డులు పొందారు. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌నుంచే కాకుండా 14 రాష్ట్రాలకు చెందిన 18 క్లబ్బులు హాజరయ్యాయి. కార్యక్రమంలో నేషనల్ ఛైర్మన్ అంజలి గుప్తా, వైస్ ఛైర్మన్ జైకుమార్, జాతీయ వైస్‌ఛైర్మన్ మనోజ్ టక్కర్, నేషనల్ కో-ఆర్డినేటర్ జీవీఎన్ రాజు, జోన్ వైస్ ఛైర్మన్లు నవీన్, మహేష్, శ్రీనివాస్, జోన్ అధికారులు వినయ్,

## ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**అక్షరటుడే, నిజాంసాగర్ :** పెద్ద కొడప్‌గల్ ఎస్సైగా అరుణ్ కుమార్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పలువురు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## కాయిన్ మింగిన బాలుడు..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఇంట్లో ఆడుకుంటూ ఓ బాలుడు కాయిన్ మింగేశాడు.. తీరా ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడడంతో గమనించిన తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే బాలుడిని తీసుకుని ఆస్పత్రికి పరుగులు తీశారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లింగంపేట మండలం లింగంపల్లి కుర్దుకు చెందిన బందెల రాజు, సంతోష దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిలో పెద్దకుమారుడైన రెండేళ్ల తన్వీర్ ఇంట్లో ఆడుకుంటుండగా.. రెండు రూపాయల కాయిన్ మింగేశాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే లింగంపేట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎక్స్‌రే తీయగా కాయిన్ మధ్యలో ఇరుక్కుందని చెప్పారు. వెంటనే కామారెడ్డి ఈఎన్టీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో.. కుటుంబ సభ్యులు బాలుడిని కామారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈఎన్టీ వైద్యులు ఆధునిక పరికరాలతో బాలుడి గొంతులో ఇరుక్కున్న కాయిన్ తొలగించడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన జాన్కంపేటలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై సాయ రెడ్డి కథనం ప్రకారం.. గుర్తుతెలియని మహిళ ఆదివారం ఉదయం రైల్వే ట్రాకు దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో ఆమె అక్కడే మృతి చెందింది. మృతురాలి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# పేలుడు పదార్థాల కేసులో కాంగ్రెస్ నేత అరెస్ట్



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో పేలుడు పదార్థాల లభించిన ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు.. తాజాగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. శనివారం రాత్రి 10 గంటల సమయంలో తన నివాసంలో చంద్రశేఖర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసినట్టుగా తెలుస్తోంది.

జిలెటిన్ స్టిక్స్ సరఫరాలో చంద్రశేఖర్ రెడ్డి ప్రమేయం ఉన్నట్టుగా పోలీసుల విచారణలో తేలినట్లుగాతెలిసింది. రెండురోజుల క్రితం జిల్లా కేంద్రంలోని కేపీఆర్ కాలనీలో ఓపెన్ ప్లాట్‌లో బండరాళ్లు పేల్చేందుకు గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి చెందిన శ్రీవారి ఎకో టౌన్ షిప్ నుంచి జిలెటిన్ స్టిక్స్, ఇతర పేలుడు పదార్థాలు తీసుకువచ్చినట్టు తెలియడంతో శ్రీవారి వెంచర్‌లో ఉన్న పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను తన వెంచర్‌లో నిల్వ చేయడంతో పాటు ఇతరులకు సరఫరా చేసిన కేసులో చంద్రశేఖర్ రెడ్డిని అరెస్టు చేసి నిజామాబాద్ జైలుకు తరలించినట్టుగా సమాచారం. కాగా.. ఈ కేసులో పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. కాగా.. రెండేళ్ల కిందట ఈ వెంచర్ డెవలప్ చేసిన చంద్రశేఖర్ రెడ్డి, ఇతరులకు విక్రయించారు. ప్రస్తుతం అక్కడ ఎలాంటి పేలుళ్లు జరగట్లేదు. తాజాగా అధికార కాంగ్రెస్ నేతను అరెస్టు చేయడంలో మరో బడా నేత ప్రమేయం ఉందని, కొద్ది రోజులుగా వీరి మధ్య విభేదాలు రావడమే అరెస్టు వరకు దారితీసిందని సొంత పార్టీ నేతల్లో జోరుగా చర్చ జరుగుతోంది.



### 'పేలుడు పదార్థాలతో నా భర్తకు సంబంధమే లేదు'

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో లభించిన పేలుడు పదార్థాలతో తన భర్తకు సంబంధం లేదని.. టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి సతీమణి, మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ ఇందుప్రియ అన్నారు. సంబంధం లేని కేసులో తన భర్తను అరెస్ట్ చేశారని వాపోయారు. కామారెడ్డిలోని తన నివాసంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. 2023 ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి తరపున ఎన్నికల్లో ప్రచారం నిర్వహించడంతో తమ కష్టానికి గుర్తింపుగా తన భర్తకు టీపీసీసీ జనరల్ సెక్రెటరీగా అవకాశం ఇచ్చారన్నారు. తమపై సోషల్ మీడియా వేదికగా కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇందుప్రియ ఆరోపించారు. వారి వివరాలన్నీ తనవద్ద ఉన్నాయని, అవసరం వచ్చినప్పుడు బయటపెడతానని పేర్కొన్నారు.

పట్టణంలో దొరికిన పేలుడు పదార్థాలకు, శ్రీవారి వెంచర్‌కు ముడి పెడుతున్నారని ఆరోపించారు. దానికి తమతో ఎలాంటి సంబంధం లేదన్నారు. శ్రీవారి వెంచర్‌లో తన భర్తకు గుంట భూమి కూడా లేదని, రాజకీయ కక్షతోనే ఈ కేసులో ఇరికించారని ఆరోపించారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే తన భర్తను అరెస్ట్ చేశారని ఇందుప్రియ పేర్కొన్నారు. రిమాండ్ చేసి నిజామాబాద్ సారంగపూర్ సెంట్రల్ జైలుకు తరలించారని తెలిపారు. ఈ కేసులో తాము చట్ట ప్రకారం ముందుకు వెళ్తామని తెలిపారు. చట్టంపై తమకు నమ్మకం ఉందన్నారు.

## మానవత్వం చాటిన బాన్సువాడ ప్రభుత్వ ఉపాధ్యాయులు

**అక్షరటుడే, బాన్సువాడ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విధులకు వెళ్తున్న క్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజేష్ జూన్ 30న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబానికి ఆర్థికసాయం చేసేందుకు బాన్సువాడ ఉపాధ్యాయులు ముందుకొచ్చారు. ఉపాధ్యాయులంతా కలిసి వాట్సాప్ గ్రూప్‌లో ఆర్థికసాయం అందించే విషయాన్ని పోస్ట్ చేశారు. 24 గంటల్లో 90 మంది ఉపాధ్యాయులు దీనికి స్పందించారు. రూ. 51,073 జమ చేశారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అంకంపాలెంకు మండల విద్యాధికారి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు మంద ప్రవీణ్, దాసరి రవీందర్, నాగార్జున్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ భాను ప్రసాద్ వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. రాజేష్ కుమారుడి పేరిట పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలు అందజేశారు.



## స్నేహితుడి కుటుంబానికి కానిస్టేబుళ్ల ఆర్థికసాయం



**అక్షరటుడే, ఇందూరు:** అనారోగ్యంతో మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబాన్ని తోటి కానిస్టేబుళ్లు ఆదుకున్నారు. తమ వంతుగా ఆర్థిక సాయం అందించారు. నస్రుల్లాబాద్ మండలానికి చెందిన 2004 బ్యాచ్ కానిస్టేబుల్ బుచ్చయ్య రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో ఆ బ్యాచ్ కానిస్టేబుళ్లు అంతాకలిసి బుచ్చయ్య కుటుంబాన్ని ఆదుకునేందుకు నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా 2004లో పీటీసీ ట్రెయినింగ్ బ్యాచ్ కానిస్టేబుళ్లు అంతా కలిసి రూ. 3 లక్షలు జమ చేశారు. ఆదివారం నస్రుల్లాబాద్‌లోని దుర్కిలో బుచ్చయ్య కుటుంబాన్ని కలిసి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు నర్సింగ్‌రావు, సురేష్, రాజశేఖర్, నరేష్, శైలేష్, నీతా, స్వప్న, శ్రీనివాస్, ప్రసాద్, రవీందర్, శివ,శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రామేశ్వరాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండలం చిన్న కొడప్‌గల్ గ్రామంలోని రామేశ్వర ఆలయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ప్రత్యేకపూజలు చేశారు. ఆదివారం తన జన్మదినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆయన సతీమణి అర్చనతో కలిసి ఆలయంలో పూజాలు నిర్వహించారు. కార్యక్రమంలో పిట్లం మార్కెట్ కమిటీ ఛైర్మన్ మనోజ్ కుమార్, కాంగ్రెస్ నిజాంసాగర్ మండల అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, ఎన్నారై భాస్కర్ రెడ్డి, పిట్లం చిన్న కొడప్‌గల్ మండలాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



**అక్షరటుడే, భీమ్‌గల్:** కేంద్రప్రభుత్వం తెచ్చిన కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ ఈనెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని టీయూసీఐ (ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా) జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ పిలుపునిచ్చారు. ఆదివారం మున్సిపల్ కార్మికులతో కలిసి కార్యక్రమ వాల్‌పోస్టర్లు భీమ్‌గల్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్త కార్మిక చట్టాలతో సమ్మె చేసే హక్కు కూడా లేకుండా పోయిందని, 11 గంటల పని దినాలు అమల్లోకి తెచ్చి వారిపై పెనుభారం మోపారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, బాలన్న, గంగాధర్, మనోహర్, కార్మికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రతినిధులకు ఘనసన్మానం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దుబ్బ మున్నూరు కాపు సంఘం ఫంక్షన్‌హాల్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్‌ను, క్రమశిక్షణ చర్యల కమిటీ సభ్యుడు జీవీ రామకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో దుబ్బ మున్నూరు కాపు సంఘం నాయకులు బంటు అవినాష్ శంకర్, సీఏ పంచరెడ్డి వికాస్ జగన్, కౌడపు శరత్, బంటు శంకర్, అశోక్, అజ్జన్ ప్రకాష్, శుభాష్ జాదవ్ పాల్గొన్నారు.

## జీవో 282ను రద్దు చేయాలి




**అక్షరటుడే, ఇందూరు:** కార్మికుల పని గంటలు పెంచుతూ తెచ్చిన 282 జీవోను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఓమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార సముదాయాల్లో పనిగంటలను 8 నుంచి 10 గంటలకు పెంచుతూ జీవో చేయడం హేయమైన చర్య అన్నారు. కేంద్రప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పనిగంటలు పెంచడం.. బీజేపీ బాటలో నడవడమేనని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనిల్, ఉపాధ్యక్షుడు చక్రపాణి, భాగ్యలక్ష్మి, కవిత, స్వరూప, స్వప్న, సాయిలు, భానుచందర్, తిరుపతిరెడ్డి, కైసర్, నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఎన్ఆర్ఐ ఆర్థికసాయం



**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం కంషెట్ పల్లి గ్రామానికి చెందిన నిరుపేద మహిళ లావణ్య అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు విషయాన్ని బాన్సువాడ బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. జిల్లా కౌన్సిల్ మెంబర్ శివప్రసాద్ అంత్యక్రియలకు అవసరమైన సామగ్రిని ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు అనుసూరి శ్రీనివాస్, యాదగిరి గౌడ్, అరిగె నారాయణ, గంగాధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ కమాండెంట్‌గా మిర్దాపల్లి యువకుడు



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలం మిర్దాపల్లికి చెందిన కర్ణాల రాము అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఇటీవల వెలువడిన గ్రూప్-ఏ ఫలితాల్లో అసిస్టెంట్ కమాండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) ఉద్యోగం పొందాడు. దీంతో ఆదివారం ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రామును సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు డీజీపీ మహేష్ భగవత్ రామును అభినందించారు.

## బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం మంథని గ్రామానికి చెందిన బూస మల్లయ్య అనారోగ్యంతో బాధపడుతూ సర్జరీ నిమిత్తం నిమ్స్ హాస్పిటల్‌లో చేరారు. దీంతో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పొద్దుటూరి వినయ్ రూ.2 లక్షల ఎల్‌వోసీని బాధిత కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ఏకలవ్య జయంతి

**అక్షరటుడే, ఇందూరు:** ఇందూరు ఏకలవ్య సంఘం ఆధ్వర్యంలో నగరంలోని 100 ఫీట్ల రోడ్డులో ఆదివారం ఏకలవ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కోనేరు సాయికుమార్, యాదగిరి, జయ కిరణ్, నరేష్, రవి, గణేష్, శ్రీరామ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

